ప్రశ్నార్థకంగా పిచ్చుకల మనుగడ

- వాతావరణంలో మార్పులు, గ్లోబల్ వార్మింగ్ కారణం
- సెల్ టవర్ల రేడియేషన్ ప్రభావం లేదని ప్రయోగాత్మక నిరూపణ
- రేపు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం


బియ్యపు గింజలను తింటున్న పిచ్చుకలు

జంగారెడ్డిగూడెం: ఇంటి పిచ్చుక (పాసర్ డొమెస్టికస్) ఒకప్పుడు విరివిగా మన ఆవాసాల్లో మసిలిన పక్షి జాతి. పిట్ట కథ, పొడుపు కథల్లో స్థానం సంపాదించిన జాతి గత నాలుగు దశాబ్దాలుగా తరిగిపోతుంది. పర్యావరణ సమతుల్యతలో ఈ ప్రాణి పాత్ర విశేషమైనది. సహజ క్రిమి సంహారిణిగా, రైతు బంధువుగా పర్యావరణ కాలుష్యంలో జీవ సంకేతాలుగా పలు పాత్రలను పిచ్చుకలు నిర్వహిస్తుంటాయి. ఈ నెల 20వ తేదీన ప్రపంచ పిచ్చుకల దినోత్సవం పురస్కరించుకుని పిచ్చుకలను కాపాడాలని సంరక్షకులు అంటున్నారు.

పిచ్చుకల తగ్గుదల

సుమారు పది వేల సంవత్సరాల కిందట మానవ జాతి ఆవిర్భావానికి సమకాలీనంగా పిచ్చుకల ఆవిర్భవించాయి. తొలుత గడ్డి ప్రాంతాల్లో జీవనం సాగిచేంది. వ్యవసాయం ఆరంభమైన తరువాత గడ్డి ప్రాంతాల నుంచి వ్యవసాయ ప్రాంతాలకు, తద్వారా మానవ ఆవాసాలకు వలస వచ్చాయి. ఆహారం సమృద్ధిగా దొరకడం, ప్రజననానికి మానవ ఆవాసాలు రక్షణగా ఉండడం వలన ఈ జాతి మానవ ఆవాసాలతో మమేకమైపోయాయి. ఆవాస క్షీణత అనగా చూరు గల తాటాకిళ్లు, పెంకుటిల్లు తగ్గిపోవడం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించడం, ఇళ్ల వద్ద ధాన్యం నిలువ చేయకపోవడం వంటి వాటి వలన ఆహార వనరులు తగ్గిపోవడంతో ఈ జాతి క్రమంగా తగ్గిపోతుంది.

సెల్ టవర్ రేడియేషన్ ఒక అపోహ మాత్రమే

మనం నిత్యం ఉపయోగించే విద్యుత్ ఉపకరణాల నుంచి విద్యుత్ అయస్కాంత తరంగాలు విడుదల అవుతాయి. ఇవి సెల్‌ఫోన్ యాంటినాల నుంచి విడుదల అయ్యే వికిరణం లాంటివే. ఈ రేడియేషన్ ప్రభావం పిచ్చుకలు, పక్షి జాతులపై ఉంటే అవి పూర్తిగా నాశనమవ్వాలి. కానీ ఆలా జరగ లేదు. జంగారెడ్డిగూడెం పట్టణంలో 2019–2022 సంవత్సరాల్లో పలు సెల్ టవర్ల నుంచి పలు దూరాల్లో ఏర్పాటు చేస్తూ వచ్చిన చెక్క గూళ్లను, ఇలా అమర్చిన గూళ్లలో పిచ్చుకల ప్రజనాన్ని పరిశీలించాం. పట్టణంలో మొత్తం 13 సెల్ టవర్లు ఉండగా, ప్రయోగాత్మకంగా బీఎస్ఎన్ఎల్ టవర్, రాజుల కాలనీలో ఏర్పాటు చేసిన టవర్లు ఎంపిక చేసి, పలు దూరాల్లో టవర్ల నుంచి విడుదలయ్యే రేడియేషన్ తీవ్రతను పరిశీలించాం. 200 మీటర్ల పరిధిలో 12 వోల్ట్ పర్ మీటర్, 200–500 మీటర్ల పరిధిలో


కృత్రిమ ఆవాసాల్లో పిచ్చుకల వృద్ధిని పరిశీలిస్తున్న సంరక్షకుడు

6.5 వోల్ట్ పర్ మీటర్, 500 మీటర్ల పరిధి దాటి 2 వోల్ట్ పర్ మీటర్‌గా రేడియేషన్ నమోదైంది. ఈ విధంగా గుర్తించిన పలు దూరాల్లో రెండు టవర్ల నుంచి 200 మీటర్ల పరిధిలో 4 సంవత్సరాలలో 112 గూళ్లను, 200–500 మీటర్ల పరిధిలో 163 గూళ్లను, 500 మీటర్ల పరిధి దాటిన ప్రదేశా ల్లో 257 గూళ్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ మూడు ప్రదేశాల్లో నాలుగు సంవత్సరాల్లో సేకరించిన డేటాను విశ్లేషణ చేయగా, పిచ్చుకల ప్రజనన వృద్ధి రేటు 72.5, 73.0, 71.06గా నమోదైంది. పిచ్చుకల జనాభా కూడా పెరుగుతూ వచ్చింది. 500 మీటర్ల పరిధిలో వాటి సంఖ్య 2023 నాటికి 560 నుంచి 580 లెక్కించాం. పట్టణంలో అవి రాత్రి బస చేసే (రూస్టింగ్ సైట్స్) స్థలాలు కూడా పెరిగాయి.

మన కర్తవ్యం

కేవలం మూడున్నర సంవత్సరాలు మాత్రమే జీవించే ఈ చిరు ప్రాణులను మనం నిరంతరం ఆదరిస్తేనే అవి తరతరాలు మనగలుగుతాయి. ఆధునిక పోకడలను వేగంగా మార్చుకొంటూ పోతున్న ఈ ప్రస్తుత తరుణంలో కృత్రిమ ఆవాసాల ఏర్పాటు, ధాన్యపు గింజలు అందుబాటులో ఉంచడం ప్రతి ఒక్కరూ ప్రాథమిక విధిగా అలవాటు చేసుకోవాలి.

పిచ్చుకల మనుగడకు కృషి



సెల్ టవర్ రేడియేషన్ ప్రభావం పిచ్చుకల మనుగడ, వాటి సంతానోత్పత్తిపై ఎంత మేరకు ఉందో తెలుసుకోవడానికి జంగారెడ్డిగూడెంలో ప్రయోగాత్మకంగా పరిశీలించాం. గత పదమూడు సంవత్సరాల నుంచి పట్టణంలో పిచ్చుకల జనాభా పెరుగుదలకు కృత్రిమ ఆవాసాలు (నెస్ట్ బాక్స్)ను ఏర్పాటు చేస్తున్నాం. కృత్రిమ ఆవాసాల పరిశీలన, యాజమాన్య నిర్వహణను సాగిస్తూ, వాటి జనాభా పెరుగుదలకు నిరంతరం కృషి చేస్తున్నాం.

–వీరా మహేష్, పిచ్చుకల సంరక్షకుడు

క్లుప్తంగా

అగ్ని ప్రమాద బాధితులకు సహాయం


బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న తపన ఫౌండేషన్ సభ్యులు

కొయ్యలగూడెం: అగ్ని ప్రమాదంలో ఇటీవల సర్వం కోల్పోయిన కుటుంబానికి తపన ఫౌండేషన్ మంగళవారం సహాయాన్ని అందజేసింది. బయ్యనగూడెంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మిద్దె శ్రీను ఇల్లు ఇటీవల దగ్ధమైన సంగతి విధితమే. విషయం తపన ఫౌండేషన్ చైర్మన్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి దృష్టికి వెళ్లిందని ఆర్గనైజర్ ఆరేటి ఏసుబాబు తెలిపారు. దీంతో రూ.5 వేల సరుకులు, స్థానికులు సమకూర్చిన నిత్యావసర వస్తువులు బాధిత కుటుంబానికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలం నరేష్, కటిక రాధాకృష్ణ, ఆరేటి ఏసుబాబు, యారవుల బాబురావు, కలవగంటి శ్రీను, రామారావు, సూర్యనారాయణ, భోగరాజు రమేష్, కటిక పవన్, సుంకర శివ, తదితరులు పాల్గొన్నారు.

మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి


విద్యుత్ ఈఈకి వినతిపత్రం అందజేస్తున్న మీటర్ రీడర్ల యూనియన్ నాయకులు

జంగారెడ్డిగూడెం: విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు కుంచె వసంతరావు కోరారు. మంగళవారం ఏపీ విద్యుత్ మీటర్ రీడర్ల యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్లను మార్చి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం వలన మీటర్ రీడర్ల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చినప్పటికీ పరిష్కారం కాలేదని ఆయన అన్నారు. గత కొన్నేళ్లుగా విద్యుత్ మీటర్ రీడర్లుగా పని చేస్తూ ఆయా టెక్నికల్, డిగ్రీ అర్హత కలిగిన వారిని ఆయా సెక్షన్ ఆఫీస్, డివిజన్ ఆఫీస్, ఎస్ఈ ఆఫీస్ లో ఉద్యోగ అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కూనపాముల విఘ్నేష్, కె.మల్లేశ్వరరావు, ఎం.నాగేశ్వరావు, కె.శ్రీనివాసరావు, ఎంవీ ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యలో క్లస్టర్ విధానం

ఏలూరు(మెట్రో): పాఠశాల విద్యాశాఖలో కీలకమైన స్కూల్ కాంప్లెక్స్‌ల స్థానంలో క్లస్టర్ల పునర్నిర్మాణంపై స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏలూరు డివిజన్ 11 మండలాలకు చెందిన ఆయా పాఠశాలల్లో ఎంఈఓలు, ఎస్ఎంసీ చైర్మన్‌లు, హెచ్ఎంలు పాల్గొని స్కూల్ మోనిటరింగ్ కమిటీలో తీసుకున్న తీర్మానాలను వివరించారు. జీఓ 117 రద్దు నేపథ్యంలో పాఠశాలలను శాటిలైట్ స్కూల్స్, ఫౌండేషనల్ స్కూల్స్, బేసిక్ ప్రైమరీ, మోడల్ ప్రైమరి, హై స్కూల్స్‌గా మార్పులకు సంబంధించి పాఠశాల వారీగా తీసుకున్న అభ్యంతరాలు, అంగీకారాలపై కలెక్టర్ ఆరాతీశారు. డీఈఓ వెంకటలక్ష్మమ్మ పాల్గొన్నారు.

పరిశోధన రంగంలో రాణించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుధాకర్

ఏలూరు(ఆర్ఆర్‌పేట): అధ్యాపకుల సహకారంలో పరిశోధన రంగంలో ముందుకు సాగాలని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుధాకర్ అన్నారు. మంగళవారం స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాలలో ఫైనల్ ఇయర్ ఇంటర్న్‌షిప్ ముగింపు సందర్భంగా డిగ్రీ పట్టాల ప్రదానోత్సవం చేశారు. కార్యక్రమంలో సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థినులు నిర్దిష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళ్లాలని సూచించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ తమ కళాశాలలో చదువు పూర్తి చేయబోతున్న సుమారు 100 మంది విద్యార్థినులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు అర్హత సాధించారని తెలిపారు. అనంతరం అనేక రంగాల్లో ప్రతిభా వంతులైన, వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మరియ క్రిస్టియ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ సునీల, ఇంటర్మీడియట్ వైస్ ప్రిన్సిపాల్ ఫాతిమా డిగాల్, వివిధ విభాగాల అధ్యాపకులు, మ్యాథమెటిక్స్, స్టాటస్టిక్స్ విభాగాధిపతి గోపినాథ్, అధ్యాపకులు శ్రావణి, పి.పూజిత, దుర్గా దేవి, జి.జ్యోతి, ఎస్ జ్యోతి, విద్యార్థినులు పాల్గొన్నారు

వాహనాల తనిఖీ


స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న ఆర్టీవో ఎండీ మదని

జంగారెడ్డిగూడెం: రవాణా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. జంగారెడ్డిగూడెం ప్రాంతీయ రవాణా అధికారి మదని ఆధ్వర్యంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రంగనాయకులు, సిబ్బంది పట్టణంలో స్కూల్, కాలేజీ బస్‌లను తనిఖీ చేశారు. ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, లైసెన్స్ లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎండీ మదని మాట్లాడుతూ వాహన యజమాన్యాలు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ వారి వాహనాలను ఫిట్‌గా ఉంచాలన్నారు. సరైన ధృవీకరణ పత్రాలు లేకుండా వాహనాలను రోడ్లపైకి తీసుకురావొద్దని సూచించారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుతాం


అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు

జంగారెడ్డిగూడెం: గ్రామాలను సారా రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. మండలంలోని పంగిడిగూడెం, లక్కవరం, దేవులపల్లి, పుట్లగట్లగూడెం గ్రామాల్లో నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా వలన కలిగే అనర్థాలను వివరించారు. అలాగే ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వీఆర్వో, వీఏఓలతో గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి సారాపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. అలాగే నవోదయం 2.0 ప్రచార రథంతో ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

28న సర్వసభ్య సమావేశం

కొయ్యలగూడెం: మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఈ నెల 28వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఎంపీపీ గంజిమాల రామారావు అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. పరిషత్ సభ్యులతో పాటు మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన సూచించారు.

మద్ది అంజన్నకు ప్రత్యేక పూజలు


స్వామి వారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి ఆలయంలో మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. భక్తులు తమలపాకులతో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. చాట్రాయి మండలం యర్రవారిగూడెంకు చెందిన శ్రీ సీతారామాంజనేయ భజన సమాజం వారు ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. మధ్యాహ్నం వరకు పలు సేవల రూపేణా రూ.1,18,080 ఆదాయం సమకూరినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. ఆలయంలోని నిత్యాన్నదాన సత్రంలో సుమారు 1400 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారన్నారు. కార్యక్రమాలను జువ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పర్యవేక్షించారు.

స్కీంల పేరుతో ఘరానా మోసం

కొయ్యలగూడెం: ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో లక్కీ డ్రాల పేరుతో కొందరు అక్రమార్కులు సిండికేటుగా ఏర్పడి ఘరానా మోసాలకు పాల్పడుతున్నారు. అందుకు ప్రధాన కేంద్రంగా కొయ్యలగూడెం పట్టణం నిలిచింది. పట్టణంలోని కొందరు యువతీ యువకులు లక్కీడ్రాల నిర్వాహకులుగా ఉండి అమాయక మహిళలను దోచుకుంటున్నారు. తీరా నెలల తరబడి ప్రైజులు రాకపోతుండడంతో లక్కీ డ్రా నిర్వాహకులు ఇస్తున్న సమాధానాలతో మోసపోయామంటూ లబో దిబోమంటున్నారు. వివరాల్లోకి వెళితే ప్రతి లక్కీ డ్రాలో రెండొందల మందిని సభ్యులుగా చేర్చుకుని వారి నుంచి ఇరవై ఏడు వారాల కాల వ్యవధిలో వేలాది రూపాయలు కట్టించుకుంటున్నారు. మొదటి వారం వంద ఆపై నుంచి పెంచుకొంటూ పోతూ చివరి వారానికి పద్నాలుగు వందల రూపాయల నుంచి రెండు వేల రూపాయలు సభ్యులతో కట్టించుకుంటారు.

ప్రచార ఆర్భాటంతో మోసపోతున్న మహిళలు

లక్కీ డ్రా నిర్వాహకుల ఆర్భాట ప్రచారాలతో అమాయక మహిళలు మోసపోతున్నారు. లక్కీ డ్రాలో సభ్యులు రెండు వారాలు కట్టకపోతే కట్టిన సొమ్ము తిరిగి ఇవ్వరు అనే నిబంధనను పెట్టారు. కొన్ని వారాల పాటు తక్కువ రేటు ఉన్న వస్తువులు పది నుంచి ఇరవై మంది సభ్యులు బహుమతులుగా గెలుచుకున్నారంటూ కొంతమందికి ఆర్భాటంగా పంపిణీ చేస్తారు. కొన్ని లక్కీ డ్రా స్కీంలు కాసు బంగారం చివరి నలుగురు విజేతలకు అంటూ ప్రచారం చేస్తారు. అన్ని వారాల్లో కడితే దాదాపు రూ.20 వేలు అవుతుందని ఏ ప్రైజు తగలని వారికి కట్టిన సొమ్ముకి సరిపడా టీవీ లేదా వాషింగ్ మిషన్, డబుల్ కాట్ మంచం ఇస్తామని నమ్మబలుకుతారు. అన్ని వారాలు అయిపోయిన పిదప లక్కీ డ్రా గురించి బహుమతుల గురించి పొంతన లేని సమాధానాలు వస్తుండడంతో అసలు నిజం తెలిసేసరికి మోసపోయామంటూ సభ్యులు వాపోతున్నారు. లక్కీ డ్రా స్కాం నిర్వాహకులు కూలి పనులకు వెళ్లే మహిళలను, చిరు వ్యాపారాలు చేసుకునే మహిళలను లక్ష్యంగా చేసుకొని తమ నేర సామ్రాజ్యాన్ని విస్తరించుకోగలిగారు. కొయ్యలగూడెంలో పుట్టిన స్కీంలు స్కాంలు బుట్టాయగూడెం,


అనధికారిక స్కీం పుస్తకాలు

పోలవరం, మండలాల వరకు విస్తరించింది. సభ్యులలో దాదాపు తొంబై శాతానికి పైగా సొమ్ములు కట్టడం వలన కేవలం ఒక లక్కీ డ్రా నిర్వహణలో అక్రమార్కులు ఎనిమిది లక్షల రూపాయల వరకు దండుకోగలుగుతున్నారు. అయితే కొత్తగా పుట్టుకొచ్చే లక్కీ డ్రాలను కూడా వారే తెర వెనక నుంచి ఆర్గనైజ్ చేయిస్తూ కొత్త వారితో కొత్త స్కీంలను పుట్టించి అదే మోసాలకు పాల్పడుతున్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

చింతలపూడి: మండలంలో వేసవి దృష్ట్యా విద్యుత్ కొరత, తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు బాణావతు రాంబాబు నాయక్ ఆదేశించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ బి.రాంబాబు నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. పలు గ్రామ పంచాయతీల్లో తాగునీటి ఎద్దడి ప్రారంభమైనట్లు సర్పంచ్‌లు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అదే విధంగా గృహనిర్మాణ శాఖ, తాగునీరు, రహదారులు, తదితర అంశాలపై సభలో వాడీవేడిగా చర్చించారు. గృహ నిర్మాణ శాఖ ద్వారా లబ్ధిదారులకు ఎస్సీ, బీసీలకు 50 వేలు, ఎస్టీలకు 75 వేలు అదనంగా ఇస్తున్నట్లు అధికారులు సభలో తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బి.రాంబాబు నాయక్

నాటు సారా నిషేధంపై సభలో చర్చించారు. ఎంపీపీ రాంబాబు నాయక్ మాట్లాడుతూ మండల పరిషత్ సమావేశాలకు అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, ఎంపీడీఓ మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ ఎస్.వరలక్ష్మి, ఈఓపీఆర్డీ రత్నకుమార్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆలయంలో చండీహోమం

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరంలో నిర్వహిస్తున్న కనకదుర్గమ్మ తిరునాళ్లలో ఐదో రోజు మంగళవారం చండీ హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త భౌమరాజు సత్యనారాయణరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ అల్లూరి రత్నాజీరావు, ఆలయ కమిటీ ప్రతినిధి యాండ్ర రవితో పాటు భక్తులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే విధంగా అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాతలు ఓంకార్ ఫెర్టిలైజర్స్, గ్రామ పెద్దలు గద్దే లక్ష్మణరావు, గద్దే సోమేశ్వరరావు, ఏసు, తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

దుర్గమ్మను దర్శించుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్

మండలంలోని రెడ్డి గణపవరంలో కొలువైన కనకదుర్గమ్మ అమ్మవారిని మంగళవారం జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి నూతన వస్త్రాలను సమర్పించి పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతు కనకదుర్గమ్మ కోర్కెలు తీర్చే తల్లిగా పేరొందిందన్నారు. ప్రతి ఏటా ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పలువురు పాల్గొని పూజలు చేశారు.


కనకదుర్గమ్మ ఆలయం వద్ద చండీ హోమం నిర్వహిస్తున్న భక్తులు


కనకదుర్గమ్మకు నూతన వస్త్రాలు సమర్పిస్తున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

మున్సిపల్ కాంట్రాక్టర్ల సమావేశం

జంగారెడ్డిగూడెం: మున్సిపల్ కాంట్రాక్టర్లు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు మాట్లాడుతూ కాంట్రాక్టులు చేపట్టే సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించామన్నారు. ఈ నేపథ్యంలో పలు తీర్మానాలు చేశామన్నారు. మున్సిపల్ అధికారులు ఎస్టిమేట్లు తయారు చేసే సమయంలో డేటాలో ఉన్న రేట్లు, మార్కెట్ రేట్లను పరిశీలించుకుని అంచనాలు తయారు చేయాలన్నారు. డ్రెయిన్లు, రోడ్లు వేసే క్రమంలో పట్టణ ప్రణాళిక విభాగం మార్కింగ్ చేసిన తరువాత మాత్రమే అంచనాలు చేయాలన్నారు. కాంట్రాక్టర్ వర్క్ పూర్తి చేసిన తరువాత 48 గంటల్లో సీఎఫ్ఎంఎస్ టోకెన్ ఇవ్వాలని, అలాగే జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ రూపాంతరం చెందిన తరువాత నుంచి ఇప్పటి వరకు చేసిన బిల్లుల డిపాజిట్లు ఇప్పించాలని తీర్మానించామన్నారు. ఈ మేరకు తీర్మానాన్ని మున్సిపల్ కమిషనర్‌కు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎంవీకే ప్రసాద్, కె.షణ్ముఖరావు, ముత్యాల శ్రీనివాస్, మద్దిపాటి నాగేశ్వరరావు, సూర్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టర్లు

పీసా చట్టంపై అవగాహన తప్పనిసరి

పోలవరం రూరల్: పీసా చట్టంపై డ్వాక్రా మహిళా సంఘం గ్రూపు లీడర్లు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డైరెక్టర్ జె.రామనాథం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పీసా చట్టంపై నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు మంగళవారం నాలుగో రోజుకు చేరాయి. శిక్షణా తరగతులను డిప్యూటీ డైరెక్టర్ రామనాథం పరిశీలించి, వివరాలను తెలుసుకున్నారు. ట్రైనింగ్ మేనేజర్ ప్రసంగిరాజు, పరిశీలకులు కారం పద్మజ, నిహారిక చట్టంపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో కె.శ్రీనివాసరావు, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఆదివాసీలకు రక్షణ కవచం

బుట్టాయగూడెం: పీసా చట్టం ఆదివాసీలకు రక్షణ కవచంలాంటిదని ఏపీ సిర్డ్ డిప్యూటీ డైరెక్టర్ జె.రామనాథం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీసా చట్టంపై నూతనంగా ఎంపికైన వైస్ ప్రెసిడెంట్, కార్యదర్శులు, డ్వాక్రా సంఘాల మహిళలు, ప్రజా ప్రతినిధులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ఆచార వ్యవహారాలు, సమస్యల పరిష్కారం పీసా చట్టం లక్ష్యమని చెప్పారు. దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈఆర్‌డీ జేడీ రమణ, ఎస్ఆర్‌డి శ్రీను, ఎంపీడీఓ కె. జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.


పోలవరం రూరల్: శిక్షణా తరగతులకు హాజరైన మహిళా సంఘం నాయకులతో అధికారులు


బుట్టాయగూడెం: మాట్లాడుతున్న రామనాథం

స్కూల్ యూనిఫాంలు తల్లిదండ్రులకు ఇవ్వాలి

కొయ్యలగూడెం: స్కూల్ యూనిఫాంలను ప్రభుత్వం నేరుగా పిల్లల తల్లిదండ్రులకు ఇవ్వాలని సీపీఐ మండల కన్వీనర్ తాడిగడప ఆంజనేయరాజు, శ్రీగణపతిరామ విలియంహో టైలర్స్ అసోసియేషన్ మంగళవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం స్కూల్ యూనిఫాం నేరుగా పిల్లల తల్లిదండ్రులకు ఇవ్వడం వలన టైలర్లకు జీవనోపాధి కలిగిందన్నారు. అలాగే కూటమి ప్రభు త్వం కూడా నేరుగా పిల్లల తల్లిదండ్రులకు ఇవ్వాల ని ఆంజనేయరాజు కోరారు. రెడీమేడ్ వస్త్రాల వల్ల, ఆన్‌లైన్ బుకింగ్ వల్ల నిరుపేద టైలర్లు ఎంతోమంది కూలీలుగా మారారన్నారు. ప్రభుత్వం టైలర్లను ఆదుకోవాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టైలర్స్ అసోసియేషన్ నాయకులు

టైలర్ల అసోసియేషన్ నాయకులు శంకు కృష్ణ, సిరి చంద్ర శేఖర్, గంగోత్రి సత్యనారాయణ, ఈదుపల్లి చంద్ర శేఖర్, స్వాగత్ ఖాసిం, నిఖిత, పద్మశ్రీ పాల్గొన్నారు.

విద్యుత్ కెపాసిటర్ల దొంగ అరెస్ట్

భీమడోలు: అంబర్‌పేట ఆక్వా చెర్వులోని విద్యుత్ త్రీఫేజ్ కెపాసిటర్లు దొంగించిన వ్యక్తిని మంగళవారం సాయంత్రం పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రామంలోని రొయ్యల రైతు సుధీర్‌కుమార్ తన చెర్వుపై షెడ్ నిర్మించుకుని అందులోని విద్యుత్ కెపాసిటర్లు భద్రపర్చాడు. పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం బ్రాహ్మణపల్లికి చెందిన తమ్మిశెట్టి గోపి అనే వ్యక్తి షెడ్డు తాళాలు పగలకొట్టి ఎలక్ట్రికల్ కెపాసిటర్లను అపహరించుకుని పరారయ్యాడు. నిందితుడ్ని పట్టుకుని భీమడోలు కోర్టులో హాజరుపర్చినట్టు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

స్కూల్ యజమానిపై కేసు నమోదు

కామవరపుకోట: సీఎంఓ అధికారిని అంటూ ఫేక్ ఐడీ సృష్టించి సోమవారం తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం వీరవల్లి టోల్ ప్లాజా వద్ద హల్చల్ చేస్తూ సిబ్బందిపై దౌర్జన్యం చేయడంతో పాటు వీడియో కవరేజ్ కోసం వచ్చిన ఓ జర్నలిస్టుపై దాడికి ప్రయత్నించిన జంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఊరకరణం జగన్నాథరావు అలియాస్ జగన్‌పై నల్లజర్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయటంతో పాటు సోమవారం రాత్రి అతడిని పోలీసులు కామవరపుకోటలో అదుపులోకి తీసుకున్నారు. ఇతను మొదటి నుంచి వివాదాస్పద వ్యక్తి కావడంతో అధికారులపై, పలువురిపై దాడి కేసులో జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌లో పలు కేసులతో పాటు రౌడీ షీట్ కూడా ఉంది. ఇటీవల కామవరపుకోట చెక్ పోస్ట్ సమీపంలో తపస్య స్కూలు పేరుతో విద్యాశాఖ నుంచి అనుమతులు లేకుండానే పాఠశాల ప్రారంభించి తరగతులు కూడా నిర్వహిస్తున్నాడు. విషయం తెలుసుకున్న విద్యాశాఖ అధికారులు నోటీసులు కూడా జారీ చేశారు. వాటిని కూడా లెక్క చేయకుండానే, దొడ్డిదారిన తరగతులు నిర్వహించే ప్రయత్నం చేశాడు. కామవరపుకోటలో కూడా పలువురు అధికారులతో, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో వివాదాలు పెట్టుకున్నాడు. అతడి అరెస్టు కామవరపుకోట మండలంలో చర్చనీయంగా మారింది. ఇదిలా ఉండగా ఊరకరణం జగన్నాథరావు తనను బెదిరించి రూ.5 లక్షలు డిమాండ్ చేసినట్లుగా కామవరపుకోటకు చెందిన విశ్వతేజ స్కూల్ ప్రిన్సిపల్ గూడెల్లి దాసు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఊరకరణం జగన్నాథరావు తాను సీఎంవోలో పని చేస్తున్నానని నీ స్కూలు గుర్తింపు రద్దు చేస్తానని బెదిరించినట్లు విశ్వతేజ ప్రిన్సిపల్ తెలిపాడు. గూడెల్లి దాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు తెలిపారు.